క్లుప్తంగా

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



లింగంపర్తిలో ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న జిల్లా అధికారి మల్లికార్జునరావు

ఏలేశ్వరం: పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని ఉద్యానశాఖ జిల్లా అధికారి మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని ఏలేశ్వరం, తిరుమాలి, లింగంపర్తి గ్రామాల్లో ఈ–పంట నమోదు చేసిన ఉద్యాన పంటలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ–పంట నమోదుతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ–క్రాప్ నమోదు చేస్తే పంటలకు ఎటువంటి నష్టం జరిగిన బీమా వర్తిస్తుందన్నారు. రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ మండల అధికారి శ్రీవల్లి, సిబ్బంది పుష్పలత, జలజ, సత్య రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులతో అమృత కలశయాత్ర



రంపయర్రంపాలెంలో అమృత కలశయాత్ర నిర్వహిస్తున్న విద్యార్థులు

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు శనివారం ఆజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కలశయాత్ర నిర్వహించారు. విద్యార్థుల్లో దేశభక్తిని, సృజనాత్మకతను పెంపొందించేందుకు పాఠశాల హెచ్ఎం గంధం ప్రమీలారాణి ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు ముగ్గులు, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు ప్రసాద్, నాగభూషణం, లక్ష్మీనారాయణ, వరలక్ష్మీ, ఆంజనేయులు, ఎమ్ఎస్ రత్నరాజు, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

గండేపల్లి: ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండల కేంద్రమైన గండేపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.47.88 లక్షలతో నూతనంగా నిర్మించిన రెండు ఆర్‌బీకేలను శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో యర్రంపాలెం జేసీఎస్ కన్వీనర్ నిమ్మలపూడి శ్రీహరి, నీలాద్రిరావుపేట సర్పంచ్ ములంపాక సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల వార్షికోత్సవం

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల 14వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డి.సునీత ఆధ్వర్యంలో విద్యార్థులు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఎనిమిది మంది పేద విద్యార్థులకు రూ.100 చొప్పున అందజేశారు.

అన్నసమారాధన

ప్రత్తిపాడు: గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని శనివారం ప్రత్తిపాడులో అన్నదానం నిర్వహించారు. జాతీయ రహదారిపై గల అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు.

పంట కాలువలోకి దూసుకెళ్లిన ఆటో



పంట కాలువలోకి దూసుకుపోయిన ఆటో

గోకవరం: స్థానిక బీఎస్ఆర్ కళాశాల సమీపంలో శనివారం ఓ ఆటో అదుపుతప్పి పంటకాలువలోకి దూసుకు పోయింది. వివరాల్లోకి వెళితే...గోకవరం నుంచి ప్రయాణికులతో రంపచోడవరం వైపు వెళుతున్న ఆటో బీఎస్ఆర్ కళాశాల వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో జరిగిన సమయంలో ఆటోలో పలువురు ప్రయాణికులతో పాటు చిన్నారులు ఉన్నారు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే వారిని బయటకు తీశారు. వారంతా స్వల్పగాయాలతో సురక్షితంగా బయటపడ్డారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

గండేపల్లి: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ శనివారం తెలిపారు. మండలంలోని తాళ్లూరుకు చెందిన కాదా ఏసుప్రసాద్ తన భార్య సీతా దుర్గాభవానికి మధ్య గొడవ జరిగింది. భార్యపై కోపగించిన ప్రసాద్ శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని భార్య సీతా దుర్గాభవానీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 98489 38665, 83094 75003 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆరోగ్యమస్తు!



వీరవరం జగనన్న ఆరోగ్య సురక్షలో రోగులకు వైద్య కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



తిరుమాలి ఆరోగ్య సురక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వతప్రసాద్

- అనారోగ్య రహిత సమాజమే లక్ష్యం
- ఎమ్మెల్యేలు జ్యోతుల చంటిబాబు, పర్వత పూర్ణచంద్రప్రసాద్
- గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రారంభం

కిర్లంపూడి: అనారోగ్య రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని వీరవరం జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన ప్రతి హెల్త్ కౌంటర్‌ను ఆయన పరిశీలించారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ తోట రవి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో 162 రకాల మందులు, 18 రకాల శస్త్రచికిత్స వినియోగ వస్తువులు, 14 రకాల ఎమర్జెన్సీ కిట్లను ఏర్పాటు చేశారన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శిబిరానికి వచ్చిన 456 మందికి వైద్యసిబ్బంది పలు రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మరో 8 మందిని మెరుగైన వైద్యకోసం పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేశారు కార్యక్రమంలో సర్పంచ్ అంబటి బుజ్జమ్మ, వైస్ సర్పంచ్ తోట నారాయణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తోట నారాయణరావు, తోట విష్ణు, తోట బాబులు, చదలవాడ బాబీ, భూపాలపట్నం ప్రసాద్, దోమాల గంగాధర్ ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు, తహసీల్దార్ కేవీ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



గండేపల్లిలో రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: పేదలకు పైసా ఖర్చు లేకుండా మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేట సచివాలయం–3లో శనివారం ఎంపీడీఓ వసంతకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత శిబిరంలో ఎమ్మెల్యే చంటిబాబు కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వచ్చిన ప్రత్యేక వైద్య నిపుణులు సుమారు 450 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, జగ్గంపేట మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎంపీడీఓ వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గండేపల్లిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ శిబిరంలో డాక్టర్లు 343 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వీరిలో ఇద్దరిని మెరుగైన వైద్య నిమిత్తం కాకినాడ, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించనున్నట్టు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచే రాజా, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, సర్పంచ్ రుత్తల లలిత, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, ఉప్పలపాడు, గండేపల్లి సొసైటీ అధ్యక్షులు పాము సూరిబాబు, కేతిన బాబి తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

శంఖవరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ సూచించారు. మండలంలోని జి.కొత్తపల్లిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. వైద్య సిబ్బంది గ్రామంలో రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. బీసీ సెల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, ఉప సర్పంచ్ గెద్దం పెద్దిరాజు, వైద్యురాలు సౌమ్యశ్రీ, పంచాయతీ కార్యదర్శి ఐవీ రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు యెడ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలో పలు గ్రామాల్లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి ఎంపీహెచ్ఈఓ డీవీఎస్ మూర్తి శనివారం పరిశీలించారు. జగన్నాథపురం, శివరామపట్నం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం

కోటనందూరు: ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. మండలంలోని కేఈ చిన్నయ్యపాలెంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. లోవదేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జీ, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, వైఎస్సార్ ఈపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, లోవదేవస్థానం మాజీ చైర్మన్ బొంగు ఉమారావు, సర్పంచ్ గుడ్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: స్థానిక ఎంపీయూపీ స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శనివారం వైస్.ఎంపీపీ నాగం గంగబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు దడాల విజయబాబు ప్రారంభించారు. డాక్టర్లు గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గాబు రాజు, ఎంపీడీఓ పసుపులేటి సతీష్, వైస్ ఎంపీపీ–2 యాదాల రమణ, పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ దూళిపూడి అంజనేయులు, ఎంపీటీసీ శివకోటి ప్రకాష్, తొండంగి సర్పంచ్ సోమాల ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



జగనన్న ఆరోగ్య సురక్షలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే పర్వతప్రసాద్

ఏలేశ్వరం: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని తిరుమాలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్షను ప్రారంభించారన్నారు. ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తారన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రతి కుటుంబాన్ని జల్లెడ పట్టి ఆరోగ్య సమస్యలను క్షేత్ర స్థాయిలో గుర్తించి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్యం అందిస్తారన్నారు. తొలుత ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో డాక్టర్లు సుమారు 500 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సూతి వీరకృష్ణ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు పసల నాగేశ్వరరావు, శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, అడపా పార్థసారథి, నీరుకొండ సత్యనారాయణ, చిక్కాల లక్ష్మణరావు, గొల్లపల్లి కాశీ విశ్వనాథ్, యిజనగిరి ప్రసాద్, బీశెట్టి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



ఇర్రిపాకలో లబ్ధిదారులకు ఫిష్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

జగ్గంపేట: మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని ఇర్రిపాకలో మత్స్యకారులకు ప్రధాన మంత్రి మత్స్య యోజన, ఫిష్ ఆంధ్రా పథకం ద్వారా మంజూరైన రూ.20 లక్షల విలువైన ఫిష్ ట్రాన్స్‌పోర్టు వాహనాలను శనివారం లబ్ధిదారులు బుర్రి సురేష్, ఎం.సత్తిబాబుకు ఎమ్మెల్యే చంటిబాబు అందజేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఎం.లావణ్య, ఏలేశ్వరం, జగ్గంపేట మత్స్యశాఖ తనిఖీ అధికారులు బి.రాజేంద్రరావు, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే చేపల ఉత్పత్తులు

తొండంగి: ప్రభుత్వం తక్కువ ధరకే నాణ్యమైన చేపల ఉత్పత్తులను అందించేందుకు మినీ ఫిష్ ఆంధ్రా యూనిట్లను ప్రారంభించిందని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. తుని మత్స్యశాఖ ఆధ్వర్యంలో తొండంగిలో ఏర్పాటు చేసిన మినీ ఫిష్ ఆంధ్రా యూనిట్ ఔట్ లెట్‌ను వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ నాయకుడు దడాల విజయబాబు, సర్పంచ్ సోమల ప్రసాద్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి కల్పించడంతో పాటు నాణ్యమైన చేపల ఉత్పత్తులను ప్రజలకు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మినీ ఫిష్ ఆంధ్రా యూనిట్లను ఓసీ, బీసీలకు 40 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం రాయితీతో అందిస్తోందన్నారు. రాష్ట్ర రోడ్లు,భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు పెరుమాళ్లపురం, తొండంగి తదితర గ్రామాల్లో తొమ్మిది యూనిట్లను ఏర్పాటు చేసినట్టు తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ నాయకులు దడాల విజయబాబు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ దూళిపూడి అంజనేయులు, పారేపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- చామవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



చామవరంలో మహిళకు పథకాలు వివరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని చామవరంలో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తాండవ సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ నాగం దొరబాబు, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత నాలుగున్నరేళ్లలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల రూపంలో చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతి కోసం నవరత్న పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఆ పథకాలు పూర్తిస్థాయిలో ప్రజలకు చేరుతున్నాయో ? లేదో ? తెలుసుకునేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న సమస్యలను మూడు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పేద, మధ్య తరగతి ప్రజల అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో దీవించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పెరిక కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం గంగాభవానీ, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంగల నాగేశ్వరరావు, ఎంపీడీఓ పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం



పారిశుధ్య కార్మికులను సత్కరించి ధ్రువపత్రాలు అందజేస్తున్న ఏలూరి బాలు

తుని: పట్టణాల అభివృద్ధిలో పారిశుధ్య కార్మికుల సేవలు కీలకమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువత అధ్యక్షుడు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు అన్నారు. ఇండియన్ స్వచ్ఛత లీగ్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పట్టణంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు కృషి చేయాలని సూచించారు. కార్మికులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ క్వాజా, మున్సిపల్ కమిషనర్ టీజేఎస్ ప్రసాదరాజు, డీఈ ప్రకాశరావు, శానిటరీ ఇనస్పెక్టర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

‘ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి’ను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



శంఖవరంలో పార్టీ నాయకులకు దిశ నిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. శంఖవరంలో ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమం నిర్వహణపై ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ కన్వీనర్లు, మండల జేసీఎస్ సభ్యులు, పార్టీ ముఖ్య నేతలతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్ల కాలంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి జగనే ఎందుకు కావాలో వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు. తమ ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. వ్యవసాయ, విద్యా రంగాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీలు పర్వత రాజబాబు, గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీలు తరుం రాజేశ్వరి, నీరుకొండ రామకుమారి, మండల కన్వీనర్లు నరాల శ్రీను, పంచాది వీరబాబు, బీసీ సెల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్ రాజా, వైఎస్సార్‌సీపీ నాయకులు అలమండ చలమయ్య,శిడగం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గణపతి నిమజ్జనాల సందడి



తునిలో గణపతి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

ఏలేశ్వరం: గణపతి నవరాత్రులు ముగియడంతో పట్టణంలోని వినాయక విగ్రహాలను శనివారం నిమజ్జనం చేశారు. పలు చోట్ల నెలకొల్పిన వినాయకుని విగ్రహాలను తీన్‌మార్, బ్యాండ్‌మేళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి స్థానిక ఏలేరు నదిలో నిమజ్జనం చేశారు. స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని గణపతి ఆలయం వద్ద లక్ష్మీగణపతి ట్యాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

తుని: పట్టణంలో వినాయక విగ్రహాల నిమజ్జనాలు జోరుగా సాగుతున్నాయి. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విగ్రహాలను బాణసంచా కాల్పులు, తీన్‌మార్ డ్యాన్సుల నడుమ ఊరేగించి తాండవ నదిలో నిమజ్జనం చేశారు.

కిర్లంపూడి: మండలంలోని వీరవరం, కొత్తపేట గ్రామాల్లోని వినాయక విగ్రహాలను శనివారం నిమజ్జనం చేశారు. మేళతాళాలు, తీన్మార్ నృత్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి ఉప్పాడ సముద్రతీరం, స్థానిక ఏలేరు కాలువల్లో నిమజ్జనం చేశారు. వీరవరంలో వినాయకుని మండపం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

జగ్గంపేట: వినాయక విగ్రహాల నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. జగ్గంపేట జ్యోతుల కాలనీలో పేపకాయల నాని యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాన్ని శనివారం గ్రామంలో ఊరేగించి నిమజ్జనం చేశారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

‘ఇండియా స్వచ్ఛత లీగ్’

ఏలేశ్వరం: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏలేశ్వరం పట్టణంలో శనివారం ఇండియా స్వచ్ఛత లీగ్ కార్యక్రమం నిర్వహించారు. నగర పంచాయతీ సిబ్బంది పలు వార్డుల్లో రోడ్లపై ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీశారు. స్థానిక 10, 12 వార్డుల్లో వైఎస్సార్ సీపీ నాయకులు సామంతుల సూర్యకుమార్, కోరాడ ప్రసాద్ సిబ్బందితో కలిసి చెత్తను తొలగించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రాధాన్యం



ఏలేశ్వరంలో జాన్‌వెస్లీని సన్మానిస్తున్న ఫెలోషిప్ ప్రతినిధులు

ఏలేశ్వరం: క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కె.జాన్‌వెస్లీ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని ఎలైజా ప్రార్థన మందిరంలో శనివారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాస్టర్లకు ఇచ్చే గౌరవ వేతనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత కలిగిన ప్రతిపాస్టర్‌కి గౌరవ వేతనం వస్తుందన్నారు. అనంతరం ఫెలోషిప్ సభ్యులు జాన్‌వెస్లీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫెలోషిప్ ప్రతినిధులు జాన్‌విల్సన్, రాజా చౌదరి, డేవిడ్ రాజ్, ప్రకాష్‌పాల్, ప్రసాద్, సునీత పాల్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రత్తిపాడు: మండలంలోని గజ్జనపూడిలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సిబ్బంది శనివారం దాడి చేశారు. ఈ దాడిలో లోకా వీరబాబు, నమ్మి శ్రీను, వనగాల వరహాలును అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,500 నగదు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ప్రత్తిపాడు పోలీసులకు అప్పగించినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు.